## క్లుప్తంగా

### మురుగునీరు నిల్వలేకుండా చర్యలు



సర్వాయిపేట వద్ద బురద రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

సాక్షి స్పందన

**కోటపల్లి:** మండలంలోని సర్వాయిపేట నుంచి నాగంపేట వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు చేరడంతో రోడ్డు బురదగా మారుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల గురించి రోడ్డుపై మురుగునీరు శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీపీవో ఆదేశాలతో ఎంపీడీవో లక్ష్మయ్య, ఏపీఎం వెంకటేశ్వర్‌లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. రోడ్డుపై మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మురుగునీరు రోడ్డుపై చేరకుండా చూడాలని కాలనీవాసులకు సూచించారు. కాలనీవాసులు ఇంకుడుగుంతల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

### ఎస్టీపీపీలో చండీయాగం



చండీయాగం చేస్తున్న అధికారులు

**జైపూర్:** మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఉన్న మైసమ్మ దేవాలయంలో తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం చండీయాగం నిర్వహించారు. అధికారులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. కొత్తగా నిర్మించనున్న శ్రీతారామచంద్రస్వామి ఆలయంలో మండలం పూర్తికాగా ప్రత్యేక పూజలు చేశారు. ఎస్టీపీపీ ఇంచార్జీ ఈడీ శ్రీనివాసులు దంపతులు పూజలు చేశారు. శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, మురళీధర్, మదన్‌మోహన్, అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

### జాతీయ సదస్సులో పరిశోధన పత్రాలు అందజేత



మురళీకృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు ఇద్దరు జాతీయ సదస్సుకు హాజరయ్యారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ క్షేత్రాలు–అక్షర దర్శనం సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు తమటం రేణుబాబు, కంబాల మురళీకృష్ణ హాజరై పరిశోధన పత్రాలు సమర్పించారు. రేణుబాబు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారదగిరీ క్షేత్రంపై నారదగిరి పరమార్థ కావ్యం, మురళీకృష్ణ బెల్లంపల్లి ప్రాంతంలోని బుగ్గ రాజరాజేశ్వరస్వామి ప్రాశస్త్యంపై మహిమాన్వితం.. బుగ్గరాజన్న క్షేత్రం అనే పరిశోధన పత్రాన్ని అందజేశారు. వీరిని నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. అధ్యాపకులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందించారు.

### సమస్యలు గుర్తించడానికే సీపీఎం బస్తీబాట

**మందమర్రిరూరల్:** మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలు గుర్తించడానికే సీపీఎం బస్తీబాట కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్వీ టెంపుల్ ఏరియా మూడవ వార్డులో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి దూలం శ్రీనివాస్, నాయకులు అంజలి, కాలనీవాసులు ఉన్నారు.

### పెద్ద చెరువు సందర్శన

**చెన్నూర్:** మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద చెరువును సందర్శించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి దారిశెట్టి కృష్ణగోపాల్‌రావు, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్లు డాక్టర్ కోట జక్కాల్, ఉప్పరి శ్రీనివాస్ ఉన్నారు.

### ఎమ్మార్పీఎస్ సంబరాలు

**దండేపల్లి:** ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై దండేపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. బస్టాండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ తీశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు బాపన్న, సతీశ్, సుభాష్, అంజన్న పాల్గొన్నారు.

# ప్రారంభమైన ‘పది’ పరీక్షలు

- కేంద్రాలకు గంట ముందుగా విద్యార్థులు
- తనిఖీ తర్వాత లోనికి
- ఆల్ ది బెస్ట్ చెప్పిన తల్లిదండ్రులు



బెల్లంపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

**జిల్లాలో** పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. వారిని తనిఖీ చేసి లోనికి పంపించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఈవోలు, ఎస్సైలు, అధికారులు కేంద్రాలను తనిఖీ చేశారు.

**బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,036 మందికిగాను 1,035 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల (సీవోఈ) పరీక్ష కేంద్రానికి చెందిన ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. సీవోఈ బాలుర గురుకుల, సంక్షేమ బాలికల గురుకుల, ప్రభుత్వ ఉన్నత, బజారుఏరియా జెడ్పీ ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రాలను ఆర్డీవో పి.హరికృష్ణ, ఎంఈవో పోచన్న సందర్శించారు.

**దండేపల్లి:** దండేపల్లి జెడ్పీ ఉన్నత, లింగాపూర్ మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో విద్యార్థులు చేరుకోగా, వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

**నెన్నెల:** నెన్నెల జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 188 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఆవుడం పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కేంద్రాన్ని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్, ఎస్సై ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. కాగా, పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలని ఆశీర్వదించండి అని టీచర్ల పాదాలకు కొందరు విద్యార్థినులు నమస్కరించి మరీ కేంద్రం లోపలికి వెళ్లారు.

**కోటపల్లి:** కోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 192 మంది విద్యార్థులు పరీక్ష రాయగా పార్‌పల్లిలో 98 మంది పరీక్ష రాశారు. మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేయకుండా లోనికి అనుమతించారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్, చేతిగడియారాలు ధరించి వెళ్లారు. తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎస్సై రాజేందర్‌లు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

**భీమారం:** భీమారం జెడ్పీ ఉన్నతపాఠశాల కేంద్రంలో 131 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేతలు ఈ కేంద్రాలను సందర్శించారు.

**తాండూర్:** తాండూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 220 మంది, విద్యాభారతి ఉన్నత పాఠశాల కేంద్రంలో 174 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఆయా కేంద్రాలను డీఈవో యాదయ్య సందర్శించారు. పరీక్ష సజావుగా జరిగిందని ఎంఈవో మల్లేశం ప్రకటించారు.

**చెన్నూర్:** పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 673 మందికి గాను 670 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు గైర్హాజరయ్యారని ఎంఈవో రాధాకృష్ణమూర్తి తెలిపారు. సీఐ దేవేందర్ ఈ కేంద్రాలను సందర్శించారు.

**జైపూర్:** జైపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 251 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇందారం పాఠశాలలో 102మంది విద్యార్థులకు 97మంది హాజరు కాగా ఐదురుగు గైర్హాజరయ్యారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

**మందమర్రిరూరల్:** మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 913 మందికిగాను 911 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని హాజీపూర్ సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పడ్తనపల్లిలోని రాంపూర్ ఆవాస విద్యాలయంలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సబ్బెపల్లి కేంద్రంలో 188 మంది, రాంపూర్ ఆవాస విద్యాలయంలో 250 మందితో కలిపి మొత్తం 438 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్, ఇద్దరు డిపార్ట్‌మెంటల్ అధికారులు, 22 మంది వరకు ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ స్క్వాడ్ బృందంతోపాటు స్పెషల్ స్క్వాడ్స్, ఎంఈవో తిరుపతిరెడ్డిలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణల్లో ఆలయాల్లో దర్శనాలు చేసి పరీక్షలు బాగా రాసేలా చూడాలని మొక్కుకున్నారు.



మందమర్రిరూరల్: బందోబస్తులో ఎస్సై



జైపూర్‌లో విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఉపాధ్యాయులు



చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



జన్నారం: విద్యార్థులను తనిఖీ చేస్తూ..

**జన్నారం:** మండలంలోని మూడు కేంద్రాల్లో మొత్తం 619 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎస్సై రాజవర్ధన్‌తో కలిసి పరిశీలించారు.

**కాసిపేట:** స్థానిక మోడల్, మల్కేపల్లి గిరిజన ఆశ్రమ, దేవాపూర్ డీఏవీ పాఠశాలల కేంద్రాల్లో మొత్తం 381 మందికి గాను 379 మంది పరీక్ష రాశారు. మోడల్ స్కూల్‌లో ఇద్దరు గైర్హాజరయ్యారు.

**రామకృష్ణాపూర్:** పట్టణంలోని ఆల్ఫోన్సా, తవక్కల్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల్లో 291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

#### ‘పది’నుంచి గట్టెక్కించు స్వామి!

**దండేపల్లి:** పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో దండేపల్లిలో కొందరు విద్యార్థులు ఉదయాన్నే రామాలయానికి వెళ్లి, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, హాల్‌టికెట్లు దేవుడి ముందు ఉంచి పూజలు చేయించారు. దేవుడా మాకు మంచి మార్కులతో పాసయ్యేలా చూడు స్వామి అని మొక్కుకుని పరీక్షకు వెళ్లారు.



రామాలయంలో పది విద్యార్థుల పూజలు



కోటపల్లి: పరీక్షకేంద్రం వద్ద విద్యార్థుల సందడి



దండేపల్లి: లింగాపూర్ మోడల్ స్కూల్ వద్ద..



రాంపూర్ ఆవాస విద్యాలయంలో..



నెన్నెల: టీచర్ల ఆశీర్వాదం తీసుకుంటూ..

### క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

**మంచిర్యాలటౌన్:** జిల్లాలో క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. ఈనెల 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో క్షయ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. టీబీ రహిత తెలంగాణ కోసం ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వైద్యులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఉచిత పరీక్షలు, నాణ్యమైన మందులు అందజేస్తామని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్షయ వ్యాధి నిర్ధారణ కోసం సీబీ నాట్ మిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌నాయక్, జిల్లా ఉప వైద్యాధికారి అనిత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి, డీపీవో ప్రశాంతి, డీపీహెచ్‌ఎన్ పద్మ, సురేందర్, వెంకటేశ్వర్లు, సీహెచ్.కాంతారావు, సుమన్, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

**నెన్నెల:** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం బొప్పారంలో గతంలో నకిలీ విత్తనాల కేసులో ఉన్న అనుమానితుల ఇళ్లలో ఎస్సై ప్రసాద్‌తో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు.

### నీటి సమస్య లేకుండా చూడాలి

**జన్నారం:** వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని దేవునిగూడా గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో డ్రెయినేజీ, పల్లె ప్రకృతివనం, నర్సరీ, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శి సరితకు సూచించారు. ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ఉన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని ర్యాలీలో మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పయ్యావుల పద్మ శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ర్యాలీలో 164 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతామని, తొలి విడతలో 60 ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ప్రత్యేకాధికారి గిరిజ, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, హౌజింగ్ ఏఈ భాస్కర్, కార్యదర్శి సదయ్య, స్థానికులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

## నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేయాలి

**శ్రీరాంపూర్:** గనుల్లో పనిచేసే కార్మికులకు నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదాలు ఎస్సార్పీ 1 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా డిపార్టుమెంట్ కార్మికులను కలిసి సమస్యలను తెలియజేశారు. అనంతరం యూనియన్ నాయకులు గని అధికారులతో మాట్లాడి నాణ్యమైన మెటీరియల్‌ను కొరత లేకుండా సరఫరా చేయాలని కోరారు. యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సెక్రెటరీ రాజయ్య, నాయకులు పరుశురాం, రాజకుమార్, నరేశ్ ఉన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

## 25 నుంచి గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

**శ్రీరాంపూర్:** ఈనెల 25 నుంచి 29 వరకు గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతిరోజు ఉదయం 10 నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 2024లో 100 మస్టర్ల కంటే తక్కువ చేసిన వారితోపాటు, గతనెల 28 నాటికి 30 మస్టర్ల చేయని వారిని కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. గైర్హాజరు కావడానికి గల కారణాలను కార్మికులు కమిటీ సమక్షంలో తగిన ఆధారాలతో తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 25న ఐకే 1ఏ, ఐకే ఓసీసీ, ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్ టింబర్ యార్డ్, 26న శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్, జీఎం ఆఫీస్, ఆర్కే 8 డిస్పెన్సరీ, 27న ఎస్‌ఆర్పీ 1, ఎస్సార్పీ 3, 28న ఆర్కే 7, ఆర్కే న్యూటెక్, 29న ఆర్కే 5, ఆర్కే 6, సీహెచ్‌పీలో పనిచేస్తున్న గైర్హాజరు లిస్టులో ఉన్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

#### ఇన్సెంటీవ్ అర్హత సాధించిన గనులు

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించినందుకుగాను అందులో పనిచేసే కార్మికులు స్పెషల్ ఇన్సెంటీవ్‌కు అర్హత సాధించారని డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని ఆర్కే 5, ఆర్కే 6, ఆర్కే న్యూటెక్, శ్రీరాంపూర్ సీహెచ్‌పీలు ఫిబ్రవరిలో కార్మికులు నిర్దేశించిన మస్టర్లు సాధించి అధిక ఉత్పత్తికి కృషి చేసినట్లు తెలిపారు. దీనికిగాను ఆర్కే 5 గనిలో గనిలో నిర్దేశించిన 22 మస్టర్లు చేసిన ఉద్యోగులకు రూ.1500, ఆర్కే 6 గనిలో ఉద్యోగులకు రూ.1700, ఆర్కే న్యూటెక్ ఉద్యోగులకు రూ.1200, శ్రీరాంపూర్ సీహెచ్‌పీ ఉద్యోగులకు రూ.2200 చొప్పున వారిఖాతాలో ఇన్సెంటీవ్ డబ్బులు జమ చేస్తారని పేర్కొన్నారు. జీఎం శ్రీనివాస్ వారిని అభినందించారు.

#### ఎస్టీపీపీ రైల్వే కార్మికులపై వేధింపులు

**జైపూర్:** ఎస్టీపీపీకి బొగ్గు రవాణా చేస్తున్న రైల్వే ట్రాక్ లైన్‌లో పనిచేస్తున్న రైల్వే సైడింగ్ అదనపు గ్యాంగ్ లేబర్‌పై మెయింటెన్స్ పనులు చేయించే పీడబ్ల్యూఐ బాలరాజు వేధింపులకు గురిచేస్తున్నాడని కార్మికులు వాపోయారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం విధులు బహిష్కరించి అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్మికులపై దుర్భాలాషలాడుతూ తీవ్ర పదజాలంతో దూషిస్తున్నాడని పేర్కొన్నారు. గతంలో ఇలాగే వ్యవహరిస్తే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న బాలరాజుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## తెలంగాణ స్టేట్ జర్నలిస్టు జిల్లా కమిటీ ఎన్నిక

**మంచిర్యాలటౌన్:** జిల్లాకేంద్రంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జిల్లా కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా యు.రాజు, కార్యదర్శిగా కె.అరుణ్‌కుమార్, కోశాధికారిగా ఎం.మనోజ్, ఉపాధ్యక్షులుగా బి.రాజశేఖర్, ఆర్.అరుణ్ కుమార్, కే.సారయ్య, బి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా టి.శ్రీనివాస్, ఎం.వినోద్, ఏ.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాము, సూర్యనారాయణ, వెంకటేశ్, లక్ష్మణ్, ఈసీ సభ్యులుగా బి.వెంకటేశ్, బి.రవీందర్, రాజేశ్వర్‌రావు, షంషీద్, సతీశ్ ఎన్నికయ్యారు.



ఎన్నుకున్న పురుషోత్తం, అనిల్ కుమార్

## ఆటోడ్రైవర్ల ఉదారత

**బెల్లంపల్లి:** పదో తరగతి విద్యార్థులను శుక్రవారం పరీక్ష కేంద్రాల వరకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి ఆటోడ్రైవర్లు ఉదారతను చాటుకున్నారు. పాత బస్టాండ్ఏరియా, కాంటా చౌరస్తా, కాల్ టెక్స్ ప్రాంతాల్లో తొలిరోజు 10 ఆటోలు అందుబాటులో ఉంచారు. తెల్లకాగితంపై ఉచిత ప్రయాణమని ప్రత్యేకంగా రాసి ఆటోలకు అంటించారు. విద్యార్థులు ఆటోలను వినియోగించుకున్నారు. బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత ప్రయాణ నిర్ణయం తీసుకున్నారు. శనివారం నుంచి మరిన్ని ఆటోలను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామని, రానుపోను వినియోగించుకోవాలన్నారు.

### ఆలిండియా ర్యాంకర్‌కు సన్మానం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని దొనబండకు చెందిన గూడెల్లి శివకుమార్ గేట్ పరీక్షలో ఆలిండియా స్థాయిలో 32వ ర్యాంకు సాధించాడు. దేశంలోని ఐఐటీ ఉత్తమ విద్యాసంస్థల్లో ఎంటెక్ పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన గేట్–2025 పరీక్షా ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో ర్యాంకు సాధించిన శివకుమార్, అతని భార్య అనూష, తల్లిదండ్రులు పద్మ–శంకరయ్యలను శుక్రవారం పద్మశాలి సంఘం, దొనబండ శ్రీచైతన్య ఉన్నత పాఠశాల యాజమాన్యం వేర్వేరుగా సన్మానించి అభినందనలు తెలిపారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, లక్సెట్టిపేట మండల అధ్యక్షుడు రాజగురువయ్య, హాజీపూర్ మండల అధ్యక్షుడు కుటుంబరావు, పాఠశాల యాజమాన్యం రమాదేవి, రవి ఉన్నారు.

### సైంటిఫిక్ అధికారి పాలిటెక్నిక్ కళాశాల సందర్శన

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను తమిళనాడు రాష్ట్రం కల్పక్కంలోని సుప్రసిద్ధ ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ అటామిక్ ఎనర్జీ విభాగం సైంటిఫిక్ అధికారి(ఎఫ్) రంగ రామకృష్ణ శుక్రవారం సందర్శించారు. కళాశాల పూర్వ విద్యార్థి రామకృష్ణకు అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతం పలికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, సురేష్, పూర్వ విద్యార్థి, సామాజిక కార్యకర్త ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

#### వాటర్ ఫ్రిజ్ అందజేత

**మంచిర్యాలటౌన్:** పాతమంచిర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శుక్రవారం ఆర్బీఐ డీజీఎం టి.జగదీశ్ కుమార్ విద్యార్థులకు చల్లని తాగునీటిని అందించేందుకు గాను వాటర్ ఫిజ్ అందించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లీడ్ జిల్లా మేనేజర్ తిరుపతి, వీఐడీఎస్ సంస్థ సీసీ రాజశేఖర్, కౌన్సిలర్లు షాహీన, స్వరూప, రాజేశ్ పాల్గొన్నారు.

#### అభివృద్ధి పనులకు భూమిపూజ

**వేమనపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ శుక్రవారం భూమిపూజ చేశారు. కేతన్‌పల్లిలో రూ.10 లక్షల ఎన్‌ఆర్‌జీఎస్ రోడ్లు, గొర్లపల్లిలో రూ.10 లక్షలు, దస్నాపూర్‌లో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులు, సుంపుటంలో రూ.25 లక్షలు, వేమనపల్లిలో రూ.25 లక్షలు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. సత్యనారాయణ, వెంకటేశం, రాజన్న, మధు, రాంచందర్, పున్నం పాల్గొన్నారు.

#### పంట మార్పిడిపై అవగాహన

## సంక్షిప్త వార్తలు

**మందమర్రిరూరల్:** మామిడిగట్టులోని రైతులకు శుక్రవారం పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏవో కిరణ్మయి ఉన్నారు.

#### బోరు తవ్వించి...భోజనం పెట్టించి

**వేమనపల్లి:** వారు దేవుడికి మొక్కుకున్న ప్రకారం ఆలయ ఆవరణలో బోరు బావి తవ్వించి తాగునీటి కష్టాలను తీర్చారు. మండలంలోని నీల్వాయి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పుప్పిరెడ్డి తిరుపతిరెడ్డి–పుష్పలత. కుమారులు ప్రదీప్, సందీప్‌రెడ్డిలకు ఉద్యోగాలు వస్తే బోరు వేయిస్తానని మొక్కుకున్నారు. ఆలయం ముందు రూ.1.50 లక్షలతో బోరు తవ్వించి ప్రత్యేక పూజ చేసి అక్కడే అందరికి అన్నదానం చేశారు. మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీతో బోర్‌వెల్‌ను ప్రారంభించారు.

#### మొక్కలకు నీరందించాలి

**కాసిపేట:** నర్సరీల్లో మొక్కలకు నీరందించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. కోమటిచేనులో వెయ్యి కోళ్ల సామర్థ్యంతో నిర్మించే కోళ్ల ఫారం, నాడేపు కంపోస్టు, దేవాపూర్ నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఉన్నారు.

#### డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

**జన్నారం:** మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులు డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు మనీష్, తదితరులు ఉన్నారు.

#### నేతకానీలకు ప్రత్యేక గ్రూపు కేటాయించాలి

**దండేపల్లి:** ఎస్సీ వర్గీకరణలో భాగంగా నేతకానీలకు ప్రత్యేక గ్రూపు కేటాయించాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు డిమాండ్ చేశారు. దండేపల్లిలో శుక్రవారం సంఘనాయకులు సమావేశమై మాట్లాడారు. నేతకానీల జనాభాను తక్కువ చూపించి తమ హక్కులను దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ఇన్‌చార్జి ఇస్సాకర్ తదితరులు పాల్గొన్నారు.

#### గుడుంబా అమ్మితే చర్యలు

**వేమనపల్లి:** గుడుంబా అమ్మితే చర్యలు తప్పవని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ హెచ్చరించారు. సూరారంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుడుంబా అమ్ముతున్నారనే యువకుల ఫిర్యాదుతో ఎస్సై అక్కడికి వెళ్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు.